క్లుప్తంగా

రేపు సీతాఫలాల సేకరణ వేలం

మహమ్మదాబాద్: మండలంలో అటవీశాఖ రేంజ్ పరిధిలో సీతాఫలాలను సేకరించేందుకు సోమవారం వేలం పాట నిర్వహించనున్నట్లు.. రేంజ్ అధికారి మహమ్మద్ అబ్దుల్‌హై తెలిపారు. మహబూబ్‌నగర్ డివిజన్ అటవీశాఖ కార్యాలయం ఆవరణలో కార్యక్రమం ఉంటుందన్నారు. పాల్గొనదలచిన వారు రూ. 5వేలు ధరావతు చెల్లించాల్సి ఉంటుందని వివరించారు.

ఇమ్మడి నారాయణ సేవలు స్ఫూర్తిదాయకం

స్టేషన్ మహబూబ్‌నగర్: ఏనుగొండ గ్రామ సర్పంచ్‌తోపాటు పలు పదవులు నిర్వహించిన ఇమ్మడి నారాయణ చేసిన నిస్వార్థ సేవలు స్ఫూర్తిదాయకమని రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ అన్నారు. ఇమ్మడి నారాయణ వర్ధంతిని పురస్కరించుకొని శనివారం స్థానిక ఏనుగొండలోని ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కొత్వాల్ మాట్లాడుతూ గ్రామాభివృద్ధి కోసం ఇమ్మడి నారాయణ నిరంతరం శ్రమించేవారని గుర్తు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్, ఇమ్మడి పురుషోత్తం, రామస్వామి, కిరణ్, వెంకటేశ్, యాదగిరిగౌడ్, ఉమర్, ప్రశాంత్, వెంకట్రాములు తదితరులు పాల్గొన్నారు.

కలుపు నివారణపై అవగాహన



జడ్చర్ల టౌన్: మండలంలోని నాగసాలలో పాలెం అగ్రికల్చర్ విద్యార్థులు శనివారం వయ్యారిభామ కలుపు నివారణపై రైతులకు అవగాహన కల్పించారు. వయ్యారిభామ అత్యంత ప్రమాదకరమైన కలుపు మొక్క అని తెలిపారు. దిగుబడి తగ్గించటంతోపాటు పశువుల ఆరోగ్యంపైన ప్రభావం చూపిస్తుందని వివరించారు. ఐమన్, ఆర్తి, నందిని, కళ్యాని, మౌనిక, శ్రీకరి తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలను ఆదుకోవాలి



మహబూబ్‌నగర్ రూరల్: క్రిష్టియన్‌పల్లి రెవెన్యూ వార్డు సర్వేనంబర్ 523లో నిరుపేదలు రేకుల షెడ్లు వేసుకుని జీవనం సాగిస్తున్నారని, అలాంటి వారి ఇళ్లను అధికారులు కూల్చడం బాధాకరమని ఎమ్మార్పీఎస్ దక్షిణ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మల్లెపోగు శ్రీనివాస్ అన్నారు. శనివారం అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో బాధితులతో కలిసి ఆయన వినతిపత్రం అందజేశారు. మానవతా దృక్పథంతో అక్కడ ఇళ్లు నిర్మించుకున్న వారికి, నిర్మాణాలు కూల్చివేసిన వారికి పునర్నిర్మాణం చేసుకోవడానికి అవకాశం కల్పించాలని కోరారు. అలా వీలుకాని పక్షంలో ప్రభుత్వ ధర గజానికి చొప్పున నిర్ణయించి వారిచే ప్రభుత్వ ఖజానాలో డబ్బులు కట్టుటకు అవకాశం ఇవ్వాలని అన్నారు. రామాంజనేయులు, రామాచారి, పద్మ, సత్యమ్మ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో ప్రతిభను గుర్తించాలి



జడ్చర్ల టౌన్: విద్యార్థుల్లో ప్రతిభను గుర్తించి వారిని ఆయా రంగాల్లో ప్రోత్సహించాలని రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ మాజీ చైర్‌పర్సన్ రజని సాయిచంద్ సూచించారు. శనివారం పట్టణంలోని రంగనాయక స్వామి ఆలయ పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన పాటల పోటీలకు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అంతకుముందు రంగనాథ స్వామిని దర్శించుకున్నారు. కమిటీ కన్వీనర్ కాల్వ రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు

రాజాపూర్: రాయపల్లిలో శనివారం పంచాయతీ కార్యదర్శి రవిప్రకాష్ ఆధ్వర్యంలో ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు చేపట్టారు. ఓపెన్ ప్లాట్లు ఉండి అందులో పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించని యజమానులకు నోటీసులు ఇచ్చారు. నీటిని నిల్వ ఉంచుకోరాదని గ్రామస్తులకు సూచించారు.

మైక్‌సెట్ కొనుగోలుకు విరాళం

దేవరకద్ర: నియోజకవర్గ కేంద్రంలో భారీ వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేసే తీగలప్ప కట్ట మండప నిర్వాహకులకు జీకేఆర్ ఫౌండేషన్ తరపున మైక్ సెట్, సౌండ్ బాక్సులు కొనుగోలు చేయడానికి రూ. 25 వేల చెక్‌ను విరాళంగా శనివారం అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ కోన రాజశేఖర్, నాయకులు వన్నాడ రాజు, పెద్ద హన్మంతు, శివుడు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



పోతులమడుగు వద్ద విద్యార్థులను కాజ్‌వే దాటిస్తున్న పోలీసులు



అడ్డాకుల మండలం వర్నె వద్ద వాగులో దారి తెగిపోవడంతో బారికేడ్లను ఏర్పాటు చేస్తున్న పోలీసులు



లింగంపేట సమీపంలో రోడ్డుపై పారుతున్న గంజివాగు



అలుగు పారుతున్న దమాయపల్లి గణపతిరాయుడు చెరువు

పొంగిపొర్లిన వాగులు

- అలుగు పారిన చెరువులు, చెక్‌డ్యాంలు
- గ్రామాలకు నిలిచిన రాకపోకలు

సాక్షినెట్‌వర్క్: ఎడతెరిపిలేని వర్షాలతో జడ్చర్ల తడిసిముద్దయ్యింది. వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. దుందుభీపై కోడ్గల్, లింగంపేట, నెక్కొండ వద్ద వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. లింగంపేట సమీపంలో గంజివాగు ప్రవాహంతో రాకపోకలు నిలిచాయి. ఆయా ప్రాంతాల నుంచి వచ్చే వాహనాలను దారి మళ్లించారు. ఆల్వాన్‌పల్లి మీనాంబరం వద్ద చెక్‌డ్యాం నిండి పారుతోంది. నసురుల్లాబాద్ చెరువు అలుగు పారుతోంది. పట్టణంలో రాజీవ్ నగర్ కాలనీ నీటమునిగింది. ఓ ఇంటి వంటింటి గోడ కూలింది. వార్డు కౌన్సిలర్ సతీష్, మున్సిపల్ సిబ్బంది ప్రాంతాన్ని సందర్శించారు. అడ్డాకుల మండలంలోని వర్నె వద్ద వాగులో శనివారం వరద నీటి ఉధృతికి దారి తెగిపోయి రాకపోకలు నిలిచిపోయాయి. మూసాపేట వైపు నుంచి పెద్దవాగుకు భారీగా వరద వెళ్తుండటంతో వర్నె వద్ద ఉన్న మట్టి దారి నీటిలో కొట్టుకుపోయింది. ఇక్కడ బ్రిడ్జి నిర్మాణం అసంపూర్తిగా ఉండటంతో ప్రస్తుతం వర్నె, ముత్యాలంపల్లి గ్రామాలకు రాకపోకలు నిలిచి పోయాయి. అడ్డాకుల ఎస్‌ఐ ఎం.శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసులు వాగు వద్ద బారికేడ్లను ఏర్పాటు చేసి ఎవరు వాగు దాటొద్దని హెచ్చరికలు జారీ చేశారు. మూసాపేట మండలం తాళ్లగడ్డకు వెళ్లే దారిలో అతికష్టం మీద రాకపోకలు సాగిస్తున్నారు. కన్మనూర్ వెళ్లే దారిలో కూడా రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది.

భూత్పూర్ మండలంలోని పోతులమడుగు–గోపన్న పల్లి గ్రామాల మధ్య శనివారం వర్షాల నేపథ్యంలో రాకపోకలు నిలిచిపోయాయి. కాజువేపై నీరు ఎక్కి పారుతుండటంతో భూత్పూర్ పోలీసులు విద్యార్థులను గ్రామస్తుల సహకారంతో దాటించారు



కాకుంట్లలో పరిస్థితిని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్

మహమ్మదాబాద్ పరిధిలో పలురోడ్లు కోతకు గురయ్యాయి. దీంతో ఎస్‌ఐ శేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో చర్యలు చేపట్టారు.

నవాబుపేట పరిధిలో తాళ్లవాగు ఉధృతంగా పారటంతో నవాబుపేట, యన్మన్‌గండ్ల గ్రామాల జంట చెరువుకు భారీగా నీరు చేరుతోంది.

హన్వాడ పరిధిలో గుడిమల్కాపూర్ సమీపంలోని పామినోనిచెరువు, చెక్‌డ్యాంలలోకి మైసమ్మ అడవుల నుంచి వచ్చే నీరు ఉధృతంగా చేరుతోంది. తహసీల్దార్ కిష్టునాయక్ హేమసముద్రం చెరువును సందర్శించారు. సూచనలు చేశారు.

చిన్నచింతకుంట పరిధిలో ఊకచెట్టువాగు, మన్నేపు వాగులు నిండుగా పారుతున్నాయి. దీంతో పరిసర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ కృష్ణయ్య, ఎస్‌ఐ శేఖర్ ప్రజలకు సూచించారు. అదేవిధంగా ఆత్మకూర్, దేవరకద్ర పట్టణాలకు రాకపోకలు నిలిచాయి. దేవరకద్ర పరిధిలో భారీవర్షానికి చెరువులు, కుంటలు అలుగు పారుతున్నాయి. పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ పరిస్థితి పరిశీలించారు. అధికారులకు జాగ్రత్తలపై సూచించారు. కోయిల్‌కొండ పరిధిలో భవానీ సాగర్, దమాయపల్లి గణపతిరాయుడు చెరువులు అలుగు పారుతున్నాయి. గార్లపహాడ్‌కు వెళ్లే దారిలో వాగు వరద పారడంతో ఎంపీడీఓ కాళప్ప స్థలానికి చేరుకొని రాకపోకలను బంద్ చేయించారు. దమాయపల్లి గుండా ప్రయాణికులను పంపించారు. చౌదర్‌పల్లి నుంచి డోకూర్‌కు వెళ్లే మట్టి సర్వీసు రోడ్డుకు గండి పడింది. తహసీల్దార్ శ్రీనివాసులు, ఆర్‌ఐ శరత్ అక్కడికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. రాకపోకలు సాగించవద్దని ప్రజలకు సూచించారు.

కంట్రోల్ రూం ఏర్పాటు

నవాబుపేట: భారీ వర్షాల నేపథ్యంలో మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో 24 గంటలు అందుబాటులో ఉండే విధంగా కంట్రోల్‌రూం ఏర్పాటు చేశారు. తహసీల్దార్ నాన్యనాయక్ శనివారం ఆయన మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు సెప్టెంబర్ 2 వరకు తమ కార్యాలయంలో నిత్యం 24 గంటలు సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. వర్షాల వల్ల ఇబ్బందులు, చెరువులు, కుంటల ప్రమాదాలు తదితర వాటిపై సమాచారం ఇవ్వాలని సూచించారు. శనివారం నుంచి నలుగురు ప్రత్యేక రెవెన్యూ సిబ్బందిని ఈ కంట్రోల్ రూంలో నియమించామని వారు నిరంతరం అందుబాటులో ఉంటారని సూచించారు.



లింగంపేట చెక్‌డ్యాం వద్ద..



దోకూర్‌లో చెరువు..



అలుగు పారుతున్న బ్రాహ్మణ్ చెరువు



హన్వాడ పరిధిలో మైసమ్మ అడవుల నుంచి వస్తున్న వాగు

లోతట్టు ప్రాంతాలన్నీ జలమయం..

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలో శుక్రవారం అర్ధరాత్రి నుంచి కురుస్తున్న ఓ మోస్తరు వర్షానికి లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. ఇక పెద్దచెరువుకు రెండువైపులా న్యూటౌన్, రామయ్యబౌలి అలుగుల వద్ద పెద్ద జాలీలు ఏర్పాటు చేశారు. రామయ్యబౌలి ప్రాంతాన్ని స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, మున్సిపల్ కమిషనర్ డి.మహేశ్వర్‌రెడ్డి తదితరులు పరిశీలించారు. అన్ని చోట్ల వార్డు ఆఫీసర్ల ఆధ్వర్యంలో పాత ఇళ్లను, శిథిలావస్థకు చేరుకున్న వాటిని పరిశీలిస్తున్నారు. 29వ వార్డు పరిధిలోని మదీన మసీదు ప్రాంతంలో ఓ పాత ఇంట్లో నివసిస్తున్న కుటుంబాన్ని మున్సిపల్ కమిషనర్ పరిశీలించి తగు సూచనలిచ్చారు.



రుహాన్సీనగర్‌లో కూలిన ఓ ఇంటి పైకప్పును పరిశీలిస్తున్న మున్సిపల్ సిబ్బంది



సంజయ్‌నగర్ కమ్యూనిటీ హాలుకు తరలిపోతున్న కుటుంబం



దివిటిపల్లిలో డబుల్ ఇళ్లలోకి వర్షం నీరు

మహబూబ్‌నగర్ రూరల్: మండల పరిధిలోని దివిటిపల్లి గ్రామ శివారులో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లలోకి శుక్రవారం అర్ధరాత్రి కురిసిన భారీ వర్షపు నీరు చేరింది. ఇళ్లలోకి వర్షం నీరు రావడంతో ప్రజలు రోడ్డుపైకి వచ్చారు. తక్షణమే అధికారులు స్పందించి డబుల్‌బెడ్‌రూంల కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని, లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.



పెద్దవాగులో నిండుగా ప్రవహిస్తున్న నీరు

పెద్దవాగుకు భారీ వరద

మూసాపేట, అడ్డాకుల మండలాల్లో విస్తరించి ఉన్న పెద్దవాగుకు శనివారం భారీ వరద వస్తోంది. శుక్రవారం అర్ధరాత్రి నుంచి ఎగువన కురుస్తున్న వర్షాలకు వరద పోటెత్తింది. మూసాపేట, సంకలమద్ది, కొమిరెడ్డిపల్లి, కందూర్, శాఖాపూర్, గుడిబండ, రాచాల, పెద్దమునుగల్‌ఛేడ్, కన్మనూర్, ముత్యాలంపల్లి, వర్నె, బలీదుపల్లి గ్రామాల మీదుగా వరద నీళ్లు దిగువన ఉన్న సరళాసాగర్ ప్రాజెక్టుకు వెళ్తున్నాయి. రెండు మండలాల్లోని పెద్దవాగులో నిర్మించిన 8 చెక్‌డ్యాంలు నిండుగా ప్రవహిస్తున్నాయి. దీంతో పాటు శాఖాపూర్, గుడిబండ, కందూర్ గ్రామాల్లో చెరువులు అలుగు పారుతున్నాయి. 44వ నంబర్ జాతీయ రహదారిపై వెళ్లే ప్రయాణికులకు చెక్‌డ్యాం, చెరువు అలుగు వద్ద పారుతున్న నీళ్లు కనువిందు చేస్తున్నాయి. రహదారిపై వాహనాలను నిలిపి మత్తడిని చూసి ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



అలుగు పారుతున్న శాఖాపూర్ చెరువు

పాడి రైతులకు అండగా ఉంటాం

కోయిల్‌కొండ: పాడి రైతులకు అండగా నిలచేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని నారాయణపేట ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్ణికారెడ్డి అన్నారు. శనివారం మండలంలో పలు గ్రామాల్లో పర్యటించారు. ఇబ్రహీంనగర్ గ్రామానికి చెందిన రైతులు శంకరయ్య, వడెన్నలకు చెందిన రెండు పాడి గేదేలు రెండు నెలల క్రితం విద్యుత్‌షాక్‌తో మృతిచెందగా.. నష్ట పరిహారం కింద రూ.40వేల చొప్పున చెక్కులను అందించారు. వర్షాలకు దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. అధికారులు నివేదికలు అందించాలని కోరారు. విద్యుత్ శాఖ ఏడీఈ మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.



చెక్కులను అందిస్తున్న ఎమ్మెల్యే పర్ణికారెడ్డి

రుణమాఫీ రాని వారు ఆందోళన చెందొద్దు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

గండేడ్: రుణమాఫీ రాని వారు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలో వివిధ పనులపై సమీక్ష సమావేశంలో పాల్గొని మాట్లాడారు. రుణమాఫీ రాని రైతుల వివరాలు సేకరించాలన్నారు. గ్రామాల్లో మహిళలు ఆర్థిక శక్తిగా ఎదిగేందుకు కృషిచేయాలని సూచించారు. వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. పారిశుద్ధ్యం, దోమల నివారణ ఇతర అంశాలపై దృష్టి సారించాలని వివరించారు. ఎంపీడీఓ దేవన్న, తహసీల్దార్ నాగలక్ష్మి, ఎంపీఈఓ నరేందర్‌రెడ్డి, మెడికల్ ఆఫీసర్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములకు కాపాడాలి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): జిల్లా కేంద్రంలో ఉన్న ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్ అన్నారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ విజయేందిర, జిల్లా ఎస్పీ జానకికి వేర్వేరుగా వినతి పత్రం సమర్పించారు. క్రిష్టియన్‌పల్లి లోని సర్వేనెంబర్ 523లోని ప్రభుత్వ భూమిని కొంత మంది ఆక్రమించుకున్నారని అలాంటి వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని కోరారు. గత ప్రభుత్వంలో ఈ సర్వే నెంబర్‌లో ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురి అయిందని ఆరోపించారు. నేరుగా డబ్బులు తీసుకుని ప్రభుత్వ భూమిని ఆక్రమించి లబ్ధిపొందారని విమర్శించారు. దళారులు దొంగ పట్టాలు సృష్టించి అమ్ముకున్నారని అలాంటి వారిని గుర్తించి వారికి కేసులు పెట్టాలని కోరారు. మున్సిపల్ వైస్ చైర్మన్ షబ్బీర్, కౌన్సిలర్లు లక్ష్మణ్‌యాదవ్, నర్సిములు, నాయకులు మునీర్, సిరాజ్‌ఖాద్రీ, రాశేద్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌ఓసీ అందజేత

అడ్డాకుల: కాటవరం గ్రామానికి చెందిన అమృతకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.75వేల ఎల్‌ఓసీ మంజూరైంది. ఈ మేరకు శనివారం హైదరాబాద్‌లోని తన నివాసంలో ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. సీఎంఆర్‌ఎఫ్‌ను అర్హులైన వారు వినియోగించుకోవాలని సూచించారు.

పెన్షన్ విద్రోహదినం పాటించాలి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: సెప్టెంబర్ 1న పెన్షనర్స్ విద్రోహదినం పాటించాలని టీపీఆర్టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్యాంబాబు, రమాకాంత్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు కొత్త పెన్షన్ విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం తెలంగాణ చౌరస్తాలోని బాబు జగ్జీవన్‌రాం విగ్రహం వద్ద చేపట్టే నిరసన కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయ, ఉద్యోగులు హాజరుకావాలని పిలుపునిచ్చారు.

పాతపెన్షన్ పునరుద్ధరణకు కృషి



జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): పాత పెన్షన్ పునరుద్ధరణకు తన వంతు కృషి చేస్తానని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి అన్నారు. ఈ మేరకు శనివారం ఆయనకు సీపీఎస్ ఉద్యోగ సంఘం నాయకులు వినతి పత్రం సమర్పించారు. ఈసందర్భంగా ఆయన స్పందిస్తూ పాత పెన్షన్ అంశం సీఎం దృష్టిలో ఉందని దాన్ని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటారని అన్నారు. జిల్లా అధ్యక్షుడు బాలస్వామి, ప్రధాన కార్యదర్శి చంద్రకాంత్, జిల్లా బాధ్యులు విజయ్, లక్ష్మయ్య, ఖాదర్, కృష్ణారెడ్డి, సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో పాడి ఆవుమృతి

మహమ్మదాబాద్: విద్యుదాఘాతంతో పాడి ఆవు మృతిచెందిన ఘటన మండల పరిధిలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా.. షేక్‌పల్లి తండాకు చెందిన కాట్రావత్ సుశీల పాడి ఆవును పెంచుకుని కుటుంబాన్ని పోషించుకుంటోంది. ఈ క్రమంలో శనివారం ఉదయం పాలు పితకడానికి వెళ్లి చూడగా.. ఆవు చనిపోయి కన్పించింది. దీంతో ఆమె బోరున విలపించింది. రెండురోజులుగా కురుస్తున్న వర్షాలకు విద్యుత్ తీగ తెగి ఆవుపై పడిందని వాపోయింది. రూ. 80 వేల నష్టం వాటిల్లిందని ప్రభుత్వం తనను ఆదుకోవాలని కోరింది.

ఆర్థికసాయం

అడ్డాకుల: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీకి చెందిన మునగల రవి ఇటీవల కరెంట్ షాక్‌తో మృతి చెందగా బాధిత కుటుంబాన్ని శనివారం కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఖాజామైనోద్దిన్ పరామర్శించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. మాజీ ఎంపీటీసీ భీమన్నయాదవ్, నవీన్‌చారి, నిరంజన్, తిరుమలేష్ తదితరులు ఉన్నారు.

నవాబుపేట: కారుకొండకి చెందిన బాలమ్మ అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందగా బాధిత కుటుంబాన్ని నాయకులు పరామర్శించారు. ఆమె అంత్యక్రియలకు జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి సహకారంతో మండల నాయకుడు భూపాల్‌రెడ్డి రూ. 5 వేలు అందజేశారు.

బోధనలో మార్పులు అవసరం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని ఎంవీఎస్ డిగ్రీ కళాశాలలో శనివారం ఐబీఎస్–ఇక్ఫాయ్ అనే సంస్థ ఆధ్వర్యంలో 'లెక్చరర్ టెక్నిక్, టైం మేనేజ్‌మెంట్ ప్రాజెక్టివిటీ' అంశంపై ఒక్కరోజు ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈమేరకు కార్యక్రమంలో ద్వారకానాథ్ సిరుగుప్పి మాట్లాడుతూ అధ్యాపకులు అవసరాలకు అనుగుణంగా బోధనలో మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. ప్రిన్సిపాల్ పద్మావతి, వైస్ ప్రిన్సిపాల్ కృష్ణమూర్తి, రవీందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి కిలో వెండి వితరణ

దేవరకద్ర: బండర్‌పల్లి సమీపంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయానికి దేవరకద్రకు చెందిన వ్యాపారి వెంకట కృష్ణయ్య, లలితమ్మ దంపతుల కుమారుడు సుదర్శన్, అరుణ దంపతులు శనివారం సాయంత్రం కిలో వెండిని అందజేశారు. దేవాలయంలో పూజా సామగ్రి తయారు చేయించడానికి ఈ వెండిని అందజేసి దేవాలయంలో పూజలు నిర్వహించారు. వెంకటేశ్వరస్వామి దేవాలయంలో అష్టోత్తర శతనామ పూజ నిమిత్తం 82 గ్రాముల వెండితో చేయించిన 108 పుష్పాలను దేవరకద్రకు చెందిన వ్యాపారి సాయిబాబ మంజుల దంపతులు అందజేశారు.

కొమిరెడ్డిపల్లిలో చెన్నకేశవస్వామి జాతర



ఊరేగింపులో పాల్గొన్న భక్తులు



గండేడ్ పరిధిలో వరహగిరి గట్టు చెన్నకేశ స్వామిని దర్శనానికి వచ్చిన భక్తులు

అడ్డాకుల: కొమిరెడ్డిపల్లి చెన్నకేశవస్వామి ఆలయం వద్ద శ్రావణ చివరి శనివారాన్ని పురస్కరించుకుని ఒక రోజు జాతర నిర్వహించారు. తెల్లవారు జామున రథోత్సవం చేపట్టారు. అంతకుముందు ఊరేగింపు చేపట్టారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేయించిన ఉట్ల కమాన్ వద్ద ఉత్సవ విగ్రహాలను ఉంచి.. ఉట్ల వేడుక కనులపండువగా నిర్వహించారు. యువకుల వేడుకలో ఉత్సాహంగా పాల్గొన్నారు.

వైభవంగా ఉత్సవాలు..

గండేడ్: వరహగిరి గట్టు చెన్నకేశస్వామి జాతర ఉత్సవాలు శనివారం ఘనంగా జరిగాయి. గండేడ్, కొంరెడ్డిపల్లి, రంగారెడ్డిపల్లి, వెన్నాచేడ్, సల్కర్‌పేట్, కప్లాపూర్, జానంపల్లి, లింగాయిపల్లి మహమ్మదాబాద్ తదితర పాంత్రాల ప్రజలు భారీగా వేడుకల్లో పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రావణ పూజలు

దేవరకద్ర రూరల్: శ్రావణమాసం చివరి శనివారం కావడంతో పలు గ్రామాల్లోని ఆలయాల్లో ప్రత్యేకపూజలు నిర్వహించారు. అభిషేకాలు, అలంకరణలు చేపట్టారు. గోపన్‌పల్లి, నాగారం గ్రామాల్లోని ఆంజనేయస్వామి ఆలయాల్లో ఊరేగింపులు నిర్వహించారు. గోపన్‌పల్లిలో గ్రామం చివర ఉన్న బావి దగ్గర గంగా దేవికి ప్రత్యేక పూజలు చేశారు. ఆ నీటిని తీసుకువచ్చి స్వామివారికి అభిషేకం చేపట్టారు.



గోపన్‌పల్లిలో ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

ఘనంగా జల్దిబిందే ఉత్సవం



కోయిల్‌కొండలో వేడుకలో పాల్గొన్న భక్తులు

కోయిల్‌కొండ: మండల కేంద్రంలో జల్దిబిందే ఉత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా లక్ష్మీ నరసింహస్వామి ఆలయం నుంచి పురోహితులు గురురాజ గ్రామ సమీపంలోని జలాల్‌కాన్ బావి దగ్గర ప్రత్యేక పూజలు నిర్వహించారు. జల్దిని తీసుకోని శ్రీ ఆదిఆంజనేయ స్వామి ఆలయంలో స్వామి వారికి అభిషేకం నిర్వహించారు. వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పట్టాలు ఇచ్చి.. కూలగొడతారా..?

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలోనే జిల్లా కేంద్రంలోని 523 సర్వే నంబర్ లో పేదలకు పట్టాలు ఇచ్చారని.. ఇప్పుడు అదే ప్రభుత్వం ఇళ్లు కూల్చడం సరికాదని మున్సిపల్ మాజీ చైర్మన్ నరసింహులు అన్నారు. మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌పై కాంగ్రెస్ నాయకులు చేసిన విమర్శలను తిప్పికొట్టారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. అర్ధరాత్రి సమయంలో ఇళ్లు కూల్చుతారా అంటూ ప్రశ్నించారు. మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఆయన సోదరుడిపై కాంగ్రెస్ నాయకులు చేసిన ఆరోపణల్లో వాస్తవం లేదని అన్నారు. బాధితులకు తాత్కాలిక వసతి సౌకర్యం కల్పించాలని బీ ఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు శివరాజ్ కోరారు. మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ గణేష్, కౌన్సిలర్ అనంతరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నవకాంత్, సత్యం, వర్థభాస్కర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకులు